క్లుప్తంగా

'గడప గడపకూ ప్రచారం చేయాలి'



హన్వాడ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ 11 ఏళ్ల కాలంలో పేదప్రజల కోసం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను బూత్‌స్థాయి కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని అధ్యక్షుడు కొండా లిగన్న అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ పేరిట దగా చేస్తుందన్నారు. మండలంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శేఖర్, రమణా రెడ్డి, కృష్ణయ్యగౌడ్, వెంకటయ్య, వేణు, మ ల్లేశ్, లక్ష్మణ్‌నాయక్, సురేందర్, రంగయ్య పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపణీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్తరేషన్ కార్డుల పంపణీ కార్యక్రమం బుధవారం స్థానిక శిల్పారామంలో ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నట్లు అర్బన్ తహసీల్దార్ ఘన్సిరాం మంగళవారం ప్రకటనలోతెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన హాస్టల్ విద్యార్థి: కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థి తప్పిపోయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్లకు చెందిన వి.శివశంకర్ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం పాఠశాల నుంచి శివశంకర్ బయటికి వచ్చాడు. తిరిగి సాయంత్రం పాఠశాల ఆవరణలో హాస్టల్ విద్యార్థులకు కనిపించాడు. అయితే రాత్రయినా హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ ఆనంద్ విద్యార్థులతో కలిసి పాఠశాలతోపాటు గ్రామంలో వెతికినా.. ఆచూకీ లభించకపోవడంతో రాత్రి మూసాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. బాలుడి తల్లిదండ్రులు శంషాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. బాలుడు అక్కడికి వెళ్లాడా లేదా మరెక్కడికైనా వెళ్లాడా అన్నది తెలియరాలేదు.

తెలంగాణ కోచ్‌గా తిరుపతియాదవ్



చిన్నచింతకుంట: తెలంగాణ రాష్ట్ర వాటర్ పోల్ బాయ్స్, బాలికల టీంకు తిరుపతి యాదవ్‌ను నియమించారు. గుజరాత్‌లో ఈనెల 13న నిర్వహించనున్న78వ నేషనల్ సీనియర్ వాటర్‌పోల్ బాయ్స్, గర్ల్స్ టోర్నీకి తెలంగాణ నుంచి కోచ్‌గా వెళ్లనున్నారు. కురుమూర్తికి చెందిన తిరుపతియాదవ్ 15ఏళ్లుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కమిటీలో పని చేశాడు. ప్రస్తుతం గచ్చిబౌలి ఇంటర్నేషనల్ స్టేడియంలో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేసి నేషనల్ టీంకు కోచ్‌గా నియమితులయ్యారు. తెలంగాణ నుంచి తిరుపతియాదవ్ కోచ్‌గా ఎంపికవడంపై మండల ప్రజలు, క్రీడాకారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

లైన్‌మన్ నిర్లక్ష్యంతో కరెంట్ కష్టాలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని నిమ్మబావిగడ్డలో లైన్‌మెన్ నిర్లక్ష్యంతో ప్రతిరోజు అర్ధరాత్రి 12గంటల నుంచి ఉదయం 8గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండటం లేదని ఆ ప్రాంతవాసులు మంగళవారం డీఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. లైన్‌మన్ స్థానికంగా లేకపోవడం, ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో సమస్య వస్తుందని ఫిర్యాదులో పొందుపర్చారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో రాత్రిళ్లు దోమలతో నిద్రపోలేక జాగరణ చేయాల్సి వస్తుందని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, లైన్‌మెన్‌ను స్థానికంగా ఉండేలా చూడాలని కోరారు.

ఆలయంలోకి చేరిన నీళ్లు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలోకి చెరువు నీళ్లు వచ్చి చేరాయి. చౌట చెరువు వరద నీళ్లతో నిండుకుని చెరువు కట్టకు ముప్పు పొంచి ఉండటంతో గ్రామస్తులు షెట్టర్‌ను ఎత్తి నీటిని ఎర్రకాల్వకు వదిలారు. అయితే 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద సర్వీస్ రోడ్డును నిర్మించే చోట కాల్వ మట్టితో పూడుకుపోయింది. దీనివల్ల కాల్వ నీళ్లు ముందుకు వెళ్లలేక పక్కనే ఆలయంలోకి వచ్చి చేరుతున్నాయి. అదేవిధంగా పలుచోట్ల కాల్వ నీళ్లు వ్యవసాయ పొలాల్లోకి వెళ్తున్నాయి. ఆలయం చుట్టు పక్కల ఉన్న ఇళ్ల చుట్టు నీళ్లు చేరుతున్నాయి. ఒక వైపు నీళ్లను వదలకుండా ఉండే పరిస్థితి లేకపోవడం.. మరోవైపు నీళ్లు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో నీటి ఉధృతికి పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనువైన ప్రదేశాలను గుర్తించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- అంధుల ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా మొక్కలు విరివిగా నాటడానికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం మెట్టుగడ్డలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల ఆవరణలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు పచ్చదనం అందించడం అందరి బాధ్యతని అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. జిల్లాకు 58లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇంకా కొన్ని శాఖలు, సంస్థలు దీనిని చేరుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతకుముందు వనమహోత్సవంపై రెడ్‌క్రాస్ సొసైటీ తయారు చేసిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనాబేగం, ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నటరాజ్, ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ కేసులు వచ్చిన వార్డులపై దృష్టిపెట్టండి

పాలమూరు: డెంగీ, చికున్‌గున్యా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎదిర పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డు తనిఖీ చేయడంతో పాటు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. క్రిస్టియన్‌పల్లి, అప్పన్నపల్లి, ఏనుగొండ సబ్ సెంటర్లలో డెంగీ కేసులు అధికంగా వచ్చినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కేసులు వచ్చిన ఇళ్లను నిత్యం పర్యవేక్షిస్తూ పరిసరాలు శుభ్రంగా పెట్టుకునే విధంగా అవగహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో ట్యాబ్‌లెట్స్, వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎంహెచ్‌వో కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో గందరగోళం

- డీటీతో సహా మధ్యాహ్నం నుంచి వెళ్లిపోయిన సిబ్బంది
- ఇబ్బంది పెడుతున్నారని తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



డీటీ, ఆర్‌ఐ ఇతర సిబ్బంది వెళ్లిపోయాక గదికి తాళం వేసిన దృశ్యం

గండేడ్: ఎలాంటి సమాచారం లేకుండా డీటీ సహా రెవెన్యూ సిబ్బంది మధ్యాహ్నం నుంచే విధుల్లో నుంచి వెళ్లి కలెక్టరేట్‌కు చేరుకొని తహసీల్దార్‌పై ఫిర్యాదు ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. వివరాలిలా.. మంగళవారం తహసీల్దార్ మల్లికార్జున్‌రావుతో పాటు డీటీ మాధవి ఇతర సిబ్బంది అందరూ ఉదయం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒకటిన్నరకు తహసీల్దార్ కార్యాలయంలో ఉండగానే ఆయనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డీటీతోపాటు ఆర్‌ఐ యాసిన్, రికార్డు, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు అంతా ఒకేసారి కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. అటెండర్ శివరాములు, చైన్‌మెన్ ఆంజనేయులుతోపాటు మరో ముగ్గురు వీఆర్‌ఏలు తహసీల్దార్ మల్లికార్జున్ మాత్రమే కార్యాలయంలో ఉండిపోయారు. వారెక్కడికెళ్లారని సిబ్బదిని అడగగా తమకేం తెలియదని సమాధానమిచ్చారు. ఈ విషయాన్ని వెంటనే తహసీల్దార్ ఆర్‌డీఓ నవీన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

గండేడ్ తహసీల్దార్ మల్లికార్జున్‌రావు నిబంధనల ప్రకారం కాకుండా కాని పనులు చేయమని ఒత్తిడి చేయడంతోపాటు మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని రెవెన్యూ అధికారులు, సిబ్బందిని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై డీటీ మాధవిని ఫోన్‌లో వివరణ కోరగా తహసీల్దార్ తమకు ఇబ్బంది కలిగిస్తున్నాడని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయమని ఒత్తిడి తేవడంతో అందరం కలిసి తమగోడు చెప్పేందుకు కలెక్టరేటుకు వెళ్లామని తెలిపారు.

తనకేలాంటి సమాచారం లేదు

డీటీతోపాటు మిగతా సిబ్బంది చెప్పాపెట్టకుండా వెళ్లారని తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. తాను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు.

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పరిమళగిరి శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన స్వామివారి 354వ ఆరాధనోత్సవాలు మంగళవారం మహా రథోత్సవంతో ముగిశాయి. చివరిరోజు ఉత్తరారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం రాఘవేంద్ర స్వామి బృందావనానికి విశేష ఫలపంచామృతాభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. భక్తుల అష్టోత్తరం, స్తోత్ర పారాయణాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కీర్తనల నడుమ వీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా ఊరేగించారు.

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం

రాఘవేంద్రస్వామి రథోత్సవ ఊరేగింపులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

- జడ్చర్ల టౌన్‌లోని రాఘవేంద్రస్వామి మఠంలో 354వ ఉత్తర ఆరాధన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ముగింపులో భాగంగా స్వామికి పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి మఠంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు బాలకృష్ణాచార్యులు, భీంసేనాచార్యులు, రాఘవేంద్రచార్యులు, పాండు, రాఘవేంద్రశర్మ, బుచ్చిలింగం, చంద్రయ్య పాల్గొన్నారు.

లోపభూయిష్టమైన విధానంతో భవిష్యత్ నాశనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశంలో లోపభూయిష్టమైన విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో 90వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యను కాశాయీకరణ, మనుధర్మ అస్తిత్వానికి అన్వయించడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న విధానాలు భవిష్యత్‌కు విఘాతం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో రాజు, పరమేశ్‌గౌడ్, సురేశ్, రాజశేఖర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మరిన్ని పొదుపు సంఘాలు

నవాబుపేట: గ్రామాల్లో మరిన్ని పొదుపు సంఘాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించిందని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా శక్తి ప్రోగ్రాంలో భాగంగా నూతన సంఘాల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాల్లోని లేనివారిని గుర్తించి నూతన సంఘాలు ఏర్పాటు చేయటం, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాలు, అలాగే 15నుంచి 19ఏళ్ల లోపు వారికి కిశోరబాలికల సంఘాలు, 60ఏళ్లుదాటిన వారికి వృద్ధ సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలన్నీ ఈనెల 30వ తేదీ లోగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం శ్రీహరి, సీసీలు కాంచన, రమాదేవి, ఎంఎంఎస్ నాయకులు అనిత, జ్యోతి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కనీస అవసరాలు తీరుస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజల కనీస అవసరాలను తప్పక తీరుస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అప్పన్నపల్లి ఫ్లై ఓవర్ సమీపంలో ముడా నిధులు రూ.2.5 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ధనలక్ష్మికాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద రూ.6.5 లక్షలతో, టీచర్స్‌కాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రూ.12 లక్షలతో నిర్మించే మల్టీపర్పస్ షెడ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి రూ.250 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీ ద్వారా ఎలక్ట్రిక్ బస్సులను జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్ మధ్య నడిపించేందుకు యత్నిస్తున్నామన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో నగరానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించగా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమాల్లో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

- జడ్చర్ల ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు దుష్యంత్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: తన తప్పులు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు దుష్యంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిడ్జిల్ మండలం కొత్తపల్లి ఇసుక రవాణాలో ఎమ్మెల్యే పాత్ర ఏమీ లేదని, జడ్చర్లలోని నల్లకుంట కబ్జాలో తనపాత్ర కూడా ఏమాత్రం లేదన్నారు. నవాబుపేట మండలం చౌడూరులో తన కంపెనీ పేరిట 4.18 ఎకరాలు భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని, ఈ భూమికి పక్కన హైదరాబాద్ చెందిన రైతులు 8ఎకరాలు కొనుగోలు చేశారన్నారు. రెండు సర్వేనెంబర్లు ఒక్కటేనని, అయితే 8ఎకరాల ప్రహరీని చౌడూరుకు చెందిన 8మంది కూల్చివేశారని, వారిపై కేసు నమోదైందన్నారు. ఈ విషయంలో అనవసరంగా కొందరు ఎస్పీ, మానవహక్కుల కమిషనర్, డీఐజీకి ఫిర్యాదు చేశారన్నారు. పైమూడింటిలో ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. తాను తప్పుచేసినట్లు రుజువు చేస్తే తన కంపెనీ పేరున కొనుగోలు చేసిన 4.18ఎకరాల భూమిని బీసీ గురుకుల పాఠశాలకు ఉచితంగా ధారాదత్తం చేస్తామని వెల్లడించారు. సమావేశంలో చౌడూరు రైతులు వేణుగోపాల్, అమరేశ్, జహంగీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటి కాల్వ తీయించాలని వినతి

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో ఉన్న భైరవ చెరువుకు కృష్ణా జలాలను తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కేఎల్‌ఐ కాల్వ మల్కాపూర్ వరకు వచ్చినందున అక్కడి నుంచి మరో అర కిలోమీటర్ దూరం తీయిస్తే భైరవ చెరువుకు కృష్ణా జలాలు వచ్చే అవకాశం ఉందని రైతులు వివరించారు. దీంతోపాటు లోకసముద్రం, ద్యామర చెరువు, చీకటివాగు వెంట శాఖాపూర్ చెంద్రాయుని చెరువుకు సాగునీరు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీంతో కొత్తగా సుమారు 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందే అవకాశం ఉన్నందున కాల్వ తీయించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనికి ఎమ్మెలే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రయ్య, బుడ్డన్న, కాశన్న, సత్యన్న, బుచ్చన్న, విష్ణు, నాగన్న తదితరులు ఉన్నారు.

15 నుంచి అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్-17 బాలుర క్రికెట్ పోటీలను ఆగస్టు 15నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోయిన్ తెలిపారు. జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహించే పోటీలను అండర్-17 ఎస్‌జీఎఫ్ సన్నాహక పోటీలుగా వెల్లడించారు. కలర్ యూనిఫాం తెల్లబంతితో పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల పాఠశాలల జట్ల వివరాలను 9985375737 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



గండేడ్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్ రూంకు వెళ్లి బియ్యం, కూరగాయాలను పరిశీలించారు. విద్యార్థులకు ఏఏ సమస్యలు ఉన్నాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు నిల్వకుండా ఇంకుడు గుంతను తవ్వించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం సల్కర్‌పేట్ మినీ గురుకులాన్ని పరిశీలించారు. పాఠశాల వెనుకవైపు మూత్రశాలలు, మరుగుదొడ్ల వద్ద డ్రైనేజీ సమస్య ఉన్నట్లు గుర్తించారు. దుర్వాసన వస్తుండడంతో నివారణకు ఇంకుడుగుంతను తవ్వించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్ ఉన్నారు.

ఎస్‌ఆర్ రంగనాథన్‌కు నివాళి



జడ్చర్ల టౌన్: లైబ్రేరియన్ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల లైబ్రరీలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ సుకన్య పాల్గొని రంగనాథన్ గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి చేయూతనిచ్చారు. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా తాజాగా ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన తరుణంలో మంగళవారం నర్సింహాచారి బాధితుడికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

అలుగు పారుతున్న చెరువులు

చిన్నచింతకుంట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నచింతకుంట మండలంలోని పలు చెరువులు, కుంటలు, చెక్కుడ్యాంలకు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో మంగళవారం చిన్నచింతకుంట, పర్దిపురం, ముచ్చింతల చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మత్తడి దూకుతున్న పర్దిపురం చెరువు



అలుగు పారుతున్న ముచ్చింతల చెరువు

ఎర్రసత్యం సేవలు చిరస్మరణీయం

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ఎర్రసత్యం చౌరస్తాలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నివాళులర్పిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి, నెట్‌వర్క్: సత్యమన్న చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచే ఉంటారని.. ఆయన పేదలపాలిట పెన్నిధి అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎర్రసత్యంచౌరస్తాలో విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, పీసీసీ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన నర్సింహారెడ్డి, పండుగ సాయన్న సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ సత్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- జడ్చర్ల టౌన్‌లోని పాతబజార్ ఎర్రసత్యం స్మారక ప్రాథమిక పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అధ్యక్షతన ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అదేవిధంగా బాబిస్ట్రీట్, సిగ్నల్‌గడ్డల్లోనూ ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు.
- హన్వాడలో ఎర్రసత్యం చిత్రపటానికి స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- నవాబుపేట మండల కేంద్రంలో ఎర్రసత్యం విగ్రహానికి సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- భూత్పూర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. అనంతరం ఎర్రసత్యం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బస్వరాజ్ గౌడ్, సత్యనారాయణ, మహ్మద్ సాధిక్, నర్సింహులు వెంకట్రాములు, రామాంజనేయులు, రాకేశ్‌గౌడ్ ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



గ్రావిటీ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

దేవరకద్ర రూరల్: యూరియా కొరత లేదని.. అవసరం మేరకు అందుబాటులో ఉంచామని.. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సీజన్‌లో రైతులకు 15వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నట్లు గుర్తించామని, కొరత లేకుండా నియోజకవర్గంలోని రైతులందరికీ సమయానుకూలంగా అందిస్తామన్నారు. యూరియా విషయంలో అపోహలు పడొద్దన్నారు. అనంతరం కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి 20గ్రామాల గొలుసుకట్టు చెరువులకు నీరు వెళ్లే గ్రావిటీ కెనాల్ పనులు పూర్తికావడంతో పరిశీలించారు. ఇటీవల మంజూరైన అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పైలాన్ ఆవిష్కరణకు సంబంధించి స్థానిక నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, కూరుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండల సముదాయానికి స్థలాల సర్వే



మూసాపేటలో ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

అడ్డాకుల: మూసాపేటలో మండల కార్యాలయాల సముదాయాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే జీఎంఆర్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు రానున్న నేపథ్యంలో అదేరోజు మండల కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేయించాలని పట్టుదలతో ఉన్నారు. ఇందుకు స్థలాలను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో మంగళవారం అధికారులు బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేశారు. గిర్దావర్ రవిశంకర్, సర్వేయర్ చిరంజీవులు, పంచాయతీ కార్యదర్శి మహేందర్ తమ సిబ్బందితో కలిసి సర్వేనంబర్ 67లో సర్వే చేశారు. స్థలానికి హద్దులను గుర్తించి లభ్యత ఉన్న భూమి వివరాలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, గ్రామస్తులు శ్రీనివాస్‌శర్మ, నారాయణ, హైమద్, సలాం, శేఖర్, గాండ్ల ప్రసాద్, పరిపూర్ణ, శ్రవన్, వంశి ఉన్నారు.

అండర్ బ్రిడ్జి వద్ద డోకూర్‌వాసుల ఆందోళన

దేవరకద్ర రూరల్: డోకూర్‌లో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి లోపల వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని.. సమస్యను పరిష్కారించాలని గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. నిర్మాణంలో లోపం ఉండటం, సరైన ప్రణాళికలు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న కాంటాక్టర్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అండర్ బ్రిడ్జి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులు పూర్తయితే సమస్య తొలగిపోతుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న నీటిని మోటర్ల సహాయంతో బయటకు పంపించారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు